క్లుప్తంగా

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం మండల కమిటీ

రోలుగుంట : మండల యూటీఎఫ్ నాయకులు గురువారం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. దీనికి ముందు ఎం.ఈ.వో–1 జానుప్రసాద్, ఎంఈవో–2 పి.జగ్గారావుని కలిసి నూతల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎంఈవోలకు శిథిలమైన పాఠశాల భవనాలను తొలగించేలా ప్రతిపాదనలు చేయాలని కోరారు. యూనియన్ పరంగా విద్యాభివృద్ధి కోసం సూచనలు తీసుకుని పాటిస్తామని సంఘ అధ్యక్షుడు కాలింగ సతీష్, ప్రధాన కార్యదర్శి యు.నాగభూషణం సభ్యులు తెలిపారు.

మూడు వరికుప్పలు దగ్ధం



కాలిపోయిన వరికుప్పలు

మాకవరపాలెం : అగ్నిప్రమాదంలో మూడు వరికుప్పలు దగ్ధమయ్యాయి. మండలంలోని పి.పి.అగ్రహారం గ్రామానికి చెందిన రొంగల వెంకటరమణకు తామరం రెవెన్యూలో ఉన్న సుమారు మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. పండిన పంటను పొలంలోనే కుప్పలుగా వేసుకున్నాడు. గురువారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మూడు వరి కుప్పలు కాలిపోయాయి. మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయిందని రైతులు వాపోయారు. సుమారు 80 బస్తాలకు పైగా ధాన్యం ఈ అగ్ని ప్రమాదంలో కాలిపోయినట్టు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. జరిగిన ఘటనపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు.

మా బళ్లోకొచ్చింది సంక్రాంతి



భోగి మంట చుట్టూ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు



తూటిపాలలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



పీడీపాలెంలో హరిదాసుల వేషధారణలో విద్యార్థులు



మల్లంపాలెం పాఠశాలలో హరిదాసు, సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు



పాఠశాలలో విద్యార్థులకు భోగిపండ్లను వేసే కార్యక్రమంలో తల్లిదండ్రులు



వివిధ వేషధారణల్లో రవీంద్రభారతి విద్యార్థులు



కళాశాలలో కొత్త కుండలో పాయసం తయారు చేస్తున్న దృశ్యం

- పాఠశాలలు, విద్యా సంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు
- సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

బుచ్చెయ్యపేట : పొట్టిదొరపాలెం గ్రామ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు గురువారం హరిదాసు, రైతులుగా వేషధారణ వేసి ఆకట్టుకున్నారు. పుర వీధుల్లో తిరుగుతూ హరిదాసు పాటలు, కీర్తనలు పాడుతూ ఇంటింటా కానుకలు స్వీకరించారు. విద్యార్థుల ప్రదర్శనను పలువురు అభినందించారు.

నర్సీపట్నం : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తురకబడిలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గాలి పటాలు, ముగ్గులు, హరిదాసు వేషధారణలతో అలరించారు. సంక్రాంతి పండగ ప్రాముఖ్యత తెలియజేసేందుకు ఈ వేడుకలను నిర్వహించామని హెచ్ఎం రమణ, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. వెంకునాయుడుపేట మండల పరిషత్ ప్రాథమి పాఠశాలలో జరిగిన వేడుకల్లో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ పాల్గొన్నారు. రవీంద్రభారతి పాఠశాలలో జరిగిన వేడుకల్లో సంక్రాంతి అనగా నూతన కాంతి, సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణం అంటారని విద్యార్థులకు ప్రిన్సిపాల్ గిరిధర్ వివరించారు.

ఉషోదయలో సంక్రాంతి సంబరాలు

చోడవరం రూరల్ : ఉషోదయా విద్యాసంస్థలు, జె.రమణాజీ చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అందమైన రంగవల్లులు, పతంగులతో విద్యార్థులు సందడి చేశారు. ఉషోదయా కళాశాలల డీన్ డి.వెంకటవాసు భోగిమంటలను రాజేసి సంబరాలను ప్రారంభించారు. విద్యార్థులు ఆడిన చెమ్మచెక్క, కోలాటం, రంగురంగుల పతంగులు ఆకర్షించాయి. విద్యాసంస్థల చైర్మన్ రమణాజీ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా పితృదేవతల్ని స్మరించుకుంటూ అందరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్, కోర్ కమిటీ సభ్యులు నాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలను ధరించి పాఠశాలకు హాజరయ్యారు. ఈ వేడుకల్లో చెరకు గడలు, వరి కంకులను అలంకరించారు. హరిదాసు వేషధారణలో విద్యార్థులు అలరించారు. రంగురంగుల రంగవల్లులు, భోగిమంటలతో వైభవంగా సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలనే ఉద్దేశ్యంతో పాఠశాలలో వేడుకలు ఏర్పాటు చేశామని హెచ్ఎం రాము తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి పాల్గొన్నారు.

కె.కోటపాడు : మల్లంపాలెం ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు గురువారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శాంతి ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో విద్యార్థులు హరిదాసు, గంగిరెద్దులవాని వేషధారణ, సంప్రదాయ దుస్తులలో ఆకట్టుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో భోగిపండ్లు వేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కన్నంనాయుడు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

మాడుగుల : మాడుగులలో గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల ముంగిట రంగవల్లికలు ఏర్పాటు చేసి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో కొత్త కుండలో పాలు పొంగించి పాయసం వండి సంబరాలు చేశారు. గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు.



భోగి మంట వెలిగిస్తున్న డీన్ వెంకటవాస్

ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులకు మెరుగైన సేవలు

కె.కోటపాడు : గర్భిణులకు ప్రభుత్వాస్పత్రుల్లోనే మెరుగైన సేవలు అందుతాయని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆస్పత్రిలో గురువారం గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం జరిగే వరకు ప్రభుత్వాసుపత్రుల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లీ,బిడ్డల ఆరోగ్యం కోసం ప్రతి నెలా 9వ తేదీన పీహెచ్‌సీల్లో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తద్వారా గర్భిణుల్లో రక్తహీనత ఇతరత్రా సమస్యలు గుర్తించి చికిత్సలు అందించడం ద్వారా సురక్షిత ప్రసవం జరగడానికి దోహద పడుతుందన్నారు. పీహెచ్ఎన్ ప్రమీలా, హెచ్‌వీ భాగ్యవతి, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

కోడిపందాలు, లాటరీ బల్లాటలు వద్దు

చీడికాడ : సంక్రాంతి, గ్రామాల్లో జరిగే తీర్థాలు, తిరునాళ్ల సందర్భంగా కోడి పందాలు, లాటరీబల్లాట, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బి.సతీష్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండగ సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదని అన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన బూడి, అనురాధ



మాజీ సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బూడి, అనురాధ

కె.కోటపాడు : మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలో గురువారం మాజీ డిప్యూటీ సీఎం, అనకాపల్లి వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, మాడుగుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర్లె అనురాధ మర్యాద పూర్వకంగా కలిసారు. అనకాపల్లి జిల్లాలో పార్టీ పటిష్టతకు తీసుకుంటున్న చర్యలను మాజీ సీఎం జగన్‌కు వివరించినట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల పార్టీ అని, కార్యకర్తకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని మాజీ సీఎం జగన్ సూచించినట్టు ఆయన తెలిపారు.

అమిత్‌షా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

మాడుగుల : అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేయడం కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షాకు తగదని, నియోజకవర్గ కాంగ్రెసు పార్టీ ఇన్‌చార్జి పడాల కొండలరావు అన్నారు. మాడుగులలో గురువారం అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ర్యాలీ చేపట్టారు. అమిత్ షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యకర్తలతో కలసి పాత బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందేజేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెసు నాయకులు

మాతా శిశు మరణాలను అరికట్టడమే లక్ష్యం

దేవరాపల్లి : మాతా శిశు మరణాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా పీఎంఎస్ఏ ప్రోగ్రాంలో ప్రతీ నెలా గర్భిణులకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్యమేఘన అన్నారు.స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ (పిఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా గురువారం 56 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు.

తారువలో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



తారువ భజన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని తారువ రామాలయం ఆవరణలో గ్రామస్తులు గురువారం రాత్రి ఆధ్యాత్మిక భజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. హరే రామ హరే కృష్ణ, కృష్ణ కృష్ణ హరే హరే నామ స్మరణం చేస్తూ భజన కార్యక్రమాన్ని 24 గంటల పాటు ఏకధాటిగా నిర్వహించనున్నారు. గురువారం రాత్రి 8 గంటలకు ప్రారంభించిన ఈ భజన కార్యక్రమం శుక్రవారం రాత్రి 8 గంటలకు ముగుస్తుందన్నారు. మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు పాల్గొని గ్రామస్తులతో కలిసి భజన చేశారు.

సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

నర్సీపట్నం : అస్వస్థతకు గురైన వేములపూడి కస్తూర్బా విద్యార్థులను ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. అనంతరం వసతిగృహం పరిసరాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. అప్పటికే అక్కడకు చేరుకున్న విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయ్ భాస్కర్‌ను కలిసి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు శానపతి వెంకటరత్నం, నాయకులు కోరారు. అనంతరం ఎంపీపీ విలేకరులతో మాట్లాడుతూ వరుసగా ఎగ్స్, అరటి కాయ కూరపెట్టడం వల్లనే గ్యాస్ ఫామ్ అయి విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు వైద్య సిబ్బంది చెబుతున్నారన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం కాకుండా తరుచూ పెట్టిందే ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఈ సంఘటన చోటు చేసుకుందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ డిమాండ్ చేశారు.



విచారణ జరపాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయ్ భాస్కర్‌ను కోరుతున్న ఎంపీపీ

నేడు గిడుతూరులో సామూహిక వ్రతాలు

మాకవరపాలెం : మండలంలోని గిడుతూరులో శుక్రవారం సామూహిక వ్రతాలు ఏర్పాటు చేసినట్టు రామాలయ కమిటీ తెలిపింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం 9 గంటల నుంచి సామూహిక వ్రతాలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులు ఈ వ్రతాల్లో పాల్గొనాలని కమిటీ సభ్యులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సీపీఎం నాయకుల గృహ నిర్బంధం సరికాదు

నర్సీపట్నం : ప్రధాని మోదీ విశాఖ వచ్చిన సందర్భంగా సీపీఎం నాయకులను గృహ నిర్బంధం చేయడం సరికాదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు ఖండించారు. ప్రభుత్వ వైఖరి పట్ల గురువారం ఆ పార్టీ నాయకులు గురువారం మున్సిపల్ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం కోసం మాట్లాడిన టీడీపీ, జనసేన నాయకులు అధికారం చేపట్టాక మర్చిపోయారన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన అప్పలనాయుడును పరామర్శిస్తున్న జెడ్పీటీసీ సత్యం

దేవరాపల్లి : రైవాడ పంచాయితీకి చెందిన సీనియర్ నాయకుడు, రిటైర్డ్ వీఆర్‌వో కె.ఎస్. అప్పలనాయుడు గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. దేవరాపల్లి నుంచి కాశీపురం వైపు ద్విచక్ర వాహనం మీద వెళ్తుండగా అల్లిపురం సమీపంలో వెనుక నుంచి వస్తున్న పెదగంగవరానికి చెందిన టాటా ఏస్ వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన అప్పలనాయుడుకు కాళ్లు, తలపైన తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి దేవరాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు విశాఖపట్నం తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా నాయుడు, దేముడునాయుడు, చంద్రమోహన్ దేవరాపల్లిలోని ఆస్పత్రికి చేరుకొని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

రూ.300 కూలి దక్కేలా కొలతలు ఇవ్వాలి

మాడుగుల : జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఒక్కరోజు పని దినానికి రూ. 300 కూలి గిట్టుబాటు అయ్యేలా కొలతలు సిద్ధం చేసుకోవాలని, ఏపీడీ బండారు శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మూడు మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సాంకేతిక శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు.

డెయిరీ రైతులకు సంక్రాంతి బోనస్



కొమళ్లపూడిలో సంక్రాంతి బోనస్ చెక్కును అందజేస్తున్న చోడవరం ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట : విశాఖ డెయిరీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. చోడవరం నియోజకవర్గ పరిధిలో గల 107 పాలసొసైటీ సభ్య రైతులకు సంక్రాంతి బోనస్‌ను కొమళ్లపూడిలో గురువారం పంపిణీ చేశారు.

బాల సదనం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



విద్యార్థులతో అప్పలనాయుడు, సిబ్బంది

నర్సీపట్నం : పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న బాల సదనం 60 మంది విద్యార్థినులకు ఎస్ఏఎస్ చారిటి ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు గురువారం ఉచితంగా దుప్పట్లు అందజేశారు. ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. తిరుపతికి చెందిన పీపుల్స్ చారిటి వారు ఆర్థిక సహకారం అందించారని ఫౌండర్ పేర్కొన్నారు. దాతల సహకారంతో విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముక్కోటి పూజలకు ఏర్పాట్లు



పూలు, పచ్చని తోరణాలతో ముస్తాబైన చోడవరం వేంకటేశ్వరస్వామి ఆలయం

చోడవరం : ఈనెల 10వతేదీ ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని చోడవరం శ్రీ కేశవస్వామి దేవాలయం, వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు చోడవరం, గోవాడ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలను రంగులు వేసి ప్రాంగణాలను మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు. విష్ణుమూర్తి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీమన్నారాయణ స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులు, తిరువీధి రథాలు, పల్లకీలు సిద్ధం చేశారు. చోడవరం వేంకటేశ్వరస్వామి, కేశవస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పర్వదినం తెల్లవారు 5గంటల నుంచి ఆరాధన పూజలు ప్రారంభిస్తారు. ఆలయాల్లో హోమం, మంగళాశాసనం, గీతాపారాయణం, విష్ణు, లలిత పారాయణం, ఆలయం ప్రాంగణంలో మహిళా కోలాట బృందాలతో కోలాట ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుని రథయాత్ర అంగరంగ వైభవంగా కోలాటం నృత్యాల మధ్య ఘనంగా తిరువీథోత్సవం నిర్వహిస్తారు. 5గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వాద్య బృందం అన్నమాచార్య కీర్తనలు, సంపూర్ణ భగవద్గీత ఆలాపన, అఖండ కర్పూర హారతి ఇస్తారు. గోవాడ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా వివిధ కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్టు ఆలయ కమిటీ తెలిపింది.

రోలుగుంట : స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయం వద్ద ఉదయం 5 గంటల నుంచి భక్తుల కోసం ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందన్నారు. అభిషేకాలు చేయించుకునే భక్తుల గోత్రనామాలు నమోదు చేసుకోవాలని కోరారు.

దేవరాపల్లి: మారేపల్లిలో పాండవుల మెట్టపై వెలసియున్న శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం ఉత్తర ద్వార దర్శనాన్ని కల్పిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్టు తెలిపారు.

మార్చికల్లా 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈవో రాజకుమార్

నాతవరం: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కె.రాజకుమార్ అన్నారు గురువారం నాతవరం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తితో సమావేశమై మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలును గురించి తెలుసుకున్నారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండల పరిషత్ జనరల్ రూ.65 లక్షలు ఉందని ఇంతవరకు ఎందుకు ఖర్చు చేయలేదంటూ సిబ్బందిని అడిగారు. రూ 25 లక్షలతో వివిధ పనులు చేయాల్సిండగా ఎందుకు జాప్యం జరుగుతుందని పీఆర్ జేఈ వెంకటేశ్వరమ్మను అడిగారు. ఆయా పనులు నెలాఖరుకు పూర్తి చేయిస్తానని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా పూర్తి చేయాలని ఆదేశించారు.

మాకవరపాలెం : ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్ సూచించారు. గిడుతూరు, లచ్చన్నపాలెంలో ఉన్న భారీ తాగునీటి ప్రాజెక్టులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా తాగునీరు అందే గ్రామాల సంఖ్య, క్లోరినేషన్ విధానం అడిగి తెలుసుకున్నారు. స్థానిక నేతలతో మాట్లాడారు. ప్రజలకు తాగునీరు సక్రమంగా అందించాలని ఆదేశించారు.



అభివృద్ధి పనులపై ఎంపీపీ లక్ష్మణమూర్తితో చర్చిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈవో రాజకుమార్

పల్లెకు పోదాం..పండగ చేద్దాం చలో చలో..

- సొంతూళ్లకు తరలివస్తున్న వలస జనం
- సందడితో పులకించి పోతున్న పల్లెలు

చోడవరం: సంక్రాంతి పండగ రావడంతో పల్లెలన్నీ జనంతో కలకలలాడుతున్నాయి. ఇప్పటికే పాఠశాలు, కాలేజీలు, ఇతర విద్యాసంస్థలకు శుక్రవారం నుంచి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులంతా గురువారం మధ్యాహ్నం నుంచి తమ స్వగ్రామాలకు వచ్చేస్తున్నారు. దూర ప్రాంతాలకు వివిధ పనుల కోసం వెళ్లిన కూలీలు కూడా సొంతూళ్లకు వచ్చేస్తున్నారు. చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల మండలాల నుంచి ఏటా వందలాది మంది కూలీలు తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా,ఒంగోలు, నెల్లూరు జిల్లాలకు వరి కోతలు, ఇతర కూలి పనులకు వెళ్లి నెలల తరబడి అక్కడే ఉంటారు. మరికొందరు చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నం ప్రాంతాలకు రోజువారీ కూలి పనులకు వలసలు వెళ్లారు. వీరంతా పిల్లలను, వృద్ధులను ఇక్కడ వదిలేసి ఏడాదంతా అక్కడ పనులు చేసి డబ్బులు సమకూర్చుకొని సంక్రాంతి పండగ నాటికి తమ సొంత ఊళ్లకు చేరుతున్నారు. తెలుగ సంప్రదాయ ప్రకారం సంక్రాంతి పండగ అంటే తమ కుటుంబీకుల్లో పెద్దలకు కొత్త దుస్తులు పెట్టడం, తోడపెద్దులకు పూజలు చేయడం జరుగుతుంది. దీంతో ఎక్కడెక్కడికో జీవనోపాధికోసం వెళ్లిన వారంతా ఇప్పుడు గ్రామాలకు చేరడంతో పల్లెలన్నీ జనంతో సందడిగా ఉన్నాయి. అమ్మనాన్నల ప్రేమలు, కొడుకు, కూతుళ్లతో తల్లిదండ్రుల అనురాగాలతో గ్రామాల్లో ఆనందం వెల్లి విరిసింది. ఈ ప్రాంతం వలస కూలీలంతా రైళ్లలో అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో దిగడంతో స్టేషన్ జనంతో కిటకిటలాడింది. పరిసర ప్రాంతాలకు వెళ్లే వారితో చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్, ఆటో స్టాండ్‌లన్నీ హడావిడిగా ఉన్నాయి. వలసలతో నిశ్శబ్దంగా ఉండే ఉప్పర గూడెం లాంటి గ్రామాలతో పాటు అన్ని గ్రామాలు ఇప్పుడు పండగ శోభ చోటుచేసుకుంది. ఇదిలావుండగా పట్టణాలకు, షాపింగ్ మాల్స్‌కి దూరంగా ఉన్న అనేక చిన్నచిన్న పల్లెటూర్లలో ఊరమ్మట వచ్చే బట్టలు అమ్మేవారి సందడి నెలకొంది. చిన్నా పెద్దా అంతా పెద్దపండగ రోజుల్లో కొత్త బట్టలు వేసుకోవడం ఆనవాయితీ కావడంతో పల్లెలకు వస్తున్న చిరు బట్టల వ్యాపారుల వద్ద కొనుగోళ్లు ఊపందుకున్నాయి.


ఆటోలపై సామాన్లతో వస్తున్న కూలీలు


వలస వెళ్లిన కూలీలు తమ స్వగ్రామాలకు ఆనందంగా వస్తున్న దృశ్యం


కొత్త బట్టలు కొనుగోళ్లతో హడావిడిగా ఉన్న పల్లె జనం

నాటు కోళ్లకు భలే గిరాకీ

మాడుగుల : వీరనారాయణంలో గురువారం జరిగిన వారపు సంతలో నాటు కోళ్లకు గిరాకీ పెరిగింది. సంక్రాంతి ముందు సంత కావడంతో నాటు కోళ్ల ధరలు అధికంగా పెరిగిపోయాయి. పందెం కోడి పుంజులు ఒక్కొక్కటి రూ.2 వేల నుంచి రూ.5 వేలు వరకు ధరలు పలికాయి. కేజీన్నర మాంసం పడే కోడి పెట్టలు జత రూ. 2వేలు నుంచి రూ.3వేలు వరకు ధరలు పెరిగిపోవడంతో కొనుగోలు దారులు వెనుదిరిగారు. ఈ సంతకు విశాఖ, అనకాపల్లి, నర్సీపట్నం తదిత దూర ప్రాంతాల నుంచి కొనుగోలు దారులు రావడంతో ధరలు పెరిగిపోయాయాయని స్థానికులు చెబుతున్నారు.


వీరనారాయణం సంతలో నాటు కోళ్లు

ఎంపీపీ నిధులతో తాగునీటి బోరు ఏర్పాటు

రోలుగుంట : బుచ్చింపేట గ్రామంలో జిగిరెడ్డి వారి కల్లాల వద్ద తాగునీటి బోరుని సర్పంచ్ ఉల బాల చంద్ర, ఎంపీటీసీ సత్యవతి గురువారం ప్రారంభించారు. ఈ కల్లాల వద్ద సమీపంలో ఏ విధమైన నీటి వసతి అవకాశం లేక రైతులు వారి పశువులకు నీరు తెచ్చేందుకు దూర ప్రాంతాలకు వెళ్లి ఇక్కట్లు పడేవారు. ఈ సమస్యను ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి సర్పంచ్ ఎంపీటీసీలు తీసుకెళ్లడంతో ఆయన స్పందించి ఎంపీపీ నిధుల నుంచి రూలక్ష రూపాయలు మంజూరు చేశారు. ఈ నిధులతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తాగు నీటి బోరును ఏర్పాటు చేశారు. సమస్య తీరడంతో రైతులు సర్పంచ్, ఎంపీటీసీలతో కలిసి ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.



అన్ని రంగాల్లో మిన్నగా మన చోడవరం



విద్య, వైద్య, వ్యాపార కేంద్రంగా దినదినాభివృద్ధి

చోడవరం : ఇటు మైదాన గ్రామాలు, అటు ఏజెన్సీ ప్రాంతానికి కేంద్రంగా ఉన్న చోడవరం పట్టణం వ్యాపార పరంగా అభివృద్ధి దిశగా పయనిస్తోంది. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల ప్రజలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరు ఏజెన్సీ ప్రాంతానికి కూడా ఇదే వ్యాపార కేంద్రం కావడంతో ఇటీవల కాలంలో చోడవరం పట్టణం పెద్దపెద్ద వ్యాపార సంస్థలతో మరింత అభివృద్ధి చెందుతోంది. అనకాపల్లి, విశాఖపట్నం, నర్సీపట్నం, మాడుగుల నియోజకవర్గాలను సునాయాసంగా రవాణా సౌకర్యం కలిగి ఉండడంతో చిన్న వ్యాపారుల దగ్గర నుంచి కార్పొరేట్ వ్యాపార సంస్థల వరకూ అన్ని ఇక్కడ తమ వ్యాపారాలను విస్తరిస్తున్నాయి. రిటైల్ దగ్గర నుంచి హోల్‌సేల్ వ్యాపారం వరకూ అంతా చోడవరం కేంద్రంగా నడుస్తుంది. కొనుగోలు అమ్మకాలతో నిత్యం ఈ పట్టణం రద్దీగా ఉంటుంది. విద్యాసంస్థలు, మరో పక్క వ్యాపార సంస్థలు, దుకాణాలతో చోడవరం దినదిన అభివృద్ధి చెందుతోంది.

ఈ పట్టణాన్ని అనుసంధానం చేస్తూ రోడ్డు, రవాణా, బస్సు సౌకర్యాలు ఉండడం వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు వ్యాపారాలు పెట్టాలన్నా ఇక్కడ అనువుగా ఉంది. చిన్నచిన్న వస్తువుల దగ్గర నుంచి బంగారం, వెండి, ఫర్నీచర్, బట్టలు, పెయింట్స్, భవననిర్మాణ సామాగ్రి, కూరగాయలు, పండ్లు, పూలు, ఫ్యాన్సీ, ప్లాస్టిక్ వంటి పెద్దపెద్ద వస్తువులు వరకూ అన్నీ ఇక్కడ దొరుకుతున్నాయి. వస్త్ర వ్యాపారం ఇటీవల కాలంలో మరింత విస్తరించింది. సూపర్ బజార్లు సైతం ఇక్కడ తమ వ్యాపారాన్ని విస్తరించాయి. మరో పక్క ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యరంగం కూడా విస్తరించింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు కూడా ఇక్కడ నెలకొల్పడంతో ఉన్నత వైద్యం కూడా అందుబాటులోకి వచ్చింది. శేషానందం వంటి హోల్‌సేల్ మందుల వ్యాపారం, ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ కూడా ఇక్కడ నుంచి తమ వ్యాపారాలను విస్తరించాయి. తల్లీపిల్ల, అభయ్ ఆరోగ్య వంటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు 24 గంటలు పూర్తిస్థాయి ఆధునిక వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవడంతో పాటు స్పెషలిస్టులైన వైద్యులను కూడా ఈ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచారు. దీనితో కార్పొరేట్ వైద్యం కూడా ఇక్కడ అందుతోంది. డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ కాలేజీలు, బీఈడీ, ఎంబీఏ, టీటీసీ విభాగాలతో ఉషోదయ విద్యాసంస్థలు, శ్రీ విజ్ఞాన్ జూనియర్ కాలేజీ వంటి ప్రైవేటు ఉన్నత కాలేజీలు కూడా చోడవరంలో ఇప్పుడు మరిన్ని విస్తరించాయి. దీనితో విద్య, వైద్యం, వ్యాపార రంగాల్లో దినదినాభివృద్ధి చెందుతూ ఇప్పుడు జిల్లాలో మిగతా పట్టణాలకు ధీటుగా చోడవరం విస్తరిస్తూ వ్యాపార కేంద్రంగా మరింతగా అభివృద్ధి చెందుతోంది.

శేషానందం మెడికల్స్...యాభై ఏళ్ల నమ్మకం



చోడవరం పరిసర ప్రాంత ప్రజలకు గత 50 యేళ్లుగా మా శేషానందం మెడికల్ స్టోర్‌ను ప్రారంభించి అన్ని రకాల మందులు అందుబాటులో విక్రయిస్తున్నాం. ఇంగ్లిష్ మందులతోపాటు ఆయుర్వేదిక్ జనరిక్ మందులు కూడా మా షాపులో ప్రజలకు అందుబాటులో ఉంచాం. సర్జికల్ సామాగ్రితోపాటు పశువులకు మందులు కూడా మా షాపులో దొరుకుతాయి. సామాన్యులకు అందుబాటు ధరలతో డిస్కౌంట్‌తో మందులు మా శేషానందం మెడికల్ స్టోర్‌లో లభ్యమౌతాయి.

– పసుమర్తి స్వర్ణ చందు, శేషానందం మెడికల్ స్టోర్ యజమాని, చోడవరం

తక్కువ ఫీజుతో ఉత్తమ బోధనకు కేరాఫ్ 'శ్రీ విజ్ఞాన్'



కార్పొరేట్ కళాశాలకు దీటుగా చోడవరంలో 2019లో శ్రీ విజ్ఞాన్ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేశాము. మా కాలేజీ నుంచిప్రతీ ఏటా ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. 2024లో రాష్ట్రస్థాయిలో పలువురు విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి మంచి ర్యాంక్‌లు సాధించారు. అన్ని మౌలిక సదుపాయాలతో కాలేజీలో ఉత్తమ విద్యాబోధన చేస్తున్నాం. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో గ్రామీణ విద్యార్థులకు మా కాలేజీ అన్ని విధాలుగా సౌకర్యంగా ఉండేలా రవాణా సౌకర్యం కూడా కల్పించాం. తక్కువ ఫీజులతో క్రమశిక్షణతో తమ సంస్థను నిర్వహిస్తున్నాం. ఎంసెట్, నీట్ ప్రవేశపరీక్షలు శిక్షణ ఇస్తున్నాం.

– ఈర్లె గోవిందరావు, కరస్పాండెంట్, శ్రీ విజ్ఞాన్ జూనియర్ కాలేజీ, చోడవరం

కేజీ నుంచి పీజీ వరకూ అగ్రగామిగా 'ఉషోదయ'



చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో గత 22 యేళ్లుగా గ్రామీణ ప్రాంతంలో కేజీ నుంచి పీజీ విద్యను అందించడంలో మా ఉషోదయ విద్యాసంస్థలు అగ్రగామిగా నిలిచాయి. 2002లో 40 మంది విద్యార్థులతో ప్రారంభమైన మా విద్యా సంస్థలు నేటికి స్కూల్, ఇంటర్, డిగ్రీ, బీఎడ్, ఎంఎడ్ అందించి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో మొదటి స్థానంలో ఉన్నాం. పూర్తిస్థాయిలో అన్ని మౌలిక సదుయాపాలు కల్పించి, విద్యార్థులు ఉత్తమ విద్యాబోధన చేస్తున్నాం. విద్యతోపాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలు కూడా విద్యార్థులకు నేర్పించి అన్ని రంగాల్లో వారిని అభివృద్ధి చేస్తున్నాం. పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేందుకు పూర్తిగా కృషి చేస్తున్నాం.

-జె.త్రిపోతుల రమణాజీ, చైర్మన్, ఉషోదయ విద్యా సంస్థలు, చోడవరం

అధునాతన దంత వైద్యం విజ్జు సొంతం

డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్యసేవ ట్రస్ట్‌తో ఉచితంగా అత్యాధునిక సేవలు



యలమంచిలి రూరల్: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో నెలకొల్పిన విజ్జు డెంటల్ హాస్పిటల్‌లో అత్యాధునిక దంత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఒకప్పుడు దంత వైద్యం కోసం యలమంచిలి నుంచి విశాఖపట్నం, అనకాపల్లి, ఇతర ప్రముఖ నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. అలాంటి పరిస్థితుల్లో దంత వైద్యుడు పి. సింహాద్రినాయుడు గ్రామీణ ప్రాంత ప్రజలకు దంతవైద్య సేవలు అందుబాటులోకి తేవాలన్న ఆశయంతో 20 ఏళ్ల క్రితం యలమంచిలి ప్రధాన రహదారి పక్కన ఎస్‌బీఐ సమీపంలో ఓ అద్దె భవనంలో దంత వైద్యశాల ప్రారంభించారు. ఆస్పత్రికి వచ్చే వారికి అప్పట్నుంచి నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పట్టణం, చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు సింహాద్రినాయుడు హస్తవాసిపై నమ్మకం ఏర్పడింది. క్రమంగా దంత వైద్యం కోసం తన వద్దకు వచ్చే రోగుల సంఖ్య బాగా పెరగడంతో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సొంత భవనాన్ని నిర్మించారు. రూట్ కెనాల్, చిగుళ్ల వ్యాధుల చికిత్స, దంతాల మార్పు, గమ్ అండ్ టీత్ వంటి చికిత్సలన్నీ అందజేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే నగదు రహిత దంత వైద్య చికిత్సలు కూడా ఇక్కడ అందుబాటులో ఉండేలా ఆస్పత్రిలో లక్షలాది రూపాయల వ్యయంతో అత్యాధునిక వైద్య పరికరాలను పొందుపరిచారు. దీంతో రోగులు ఇక్కడే దంతాలకు సంబంధించిన అన్ని సమస్యలకు చికిత్స పొందుతున్నారు.

అన్నిరకాల సేవలు అందుబాటులోకి..



నేను యలమంచిలిలో దంత వైద్యం కోసం 2003లో ఆస్పత్రి ప్రారంభించినపుడు ఎలాంటి ఆస్పత్రులు లేవు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు దంతవైద్య సమస్యల కోసం ఎంతో ఇబ్బంది పడేవారు. దీనిని గుర్తించి ఇక్కడే అధునాతన దంత వైద్య సేవలు అందుబాటులోకి తెస్తే అందరికీ ప్రయోజనం కలుగుతుందన్న భావనతో ఆస్పత్రిని దశల వారీగా నవీకరించాను. ప్రముఖ నగరాల్లో అందుతున్న దంత వైద్య సేవలన్నీ ఇక్కడ అందించగలుగుతున్నాం. ప్రభుత్వ ఉద్యోగులు, నేవీ, ఆర్మీ, వర్కింగ్ జర్నలిస్టులకు కూడా నగదు రహిత వైద్య సేవలందించే స్థాయికి ఆస్పత్రిని అభివృద్ధి చేయడం వెనుక ఈ ప్రాంత ప్రజల ఆదరాభిమానాలే కారణం. 20 ఏళ్లుగా ఆస్పత్రిని అభివృద్ధి పథంలో నిర్వహించడం వెనుక నా భార్య సునీత అవిశ్రాంత శ్రమ, తోడ్పాటు కూడా ఉంది.

– సింహాద్రినాయుడు, దంత వైద్యుడు, విజ్జు డెంటల్ ఆస్పత్రి యజమాని